ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024



ముహూర్తం సమయానికే నామినేషన్ దాఖలు

నామినేషన్ దాఖలు చేసే సమయంపై తొలుత కొంత గందరగోళం నెలకొంది. మొదట మధ్యాహ్నం 12.33 గంటలకు నామినేషన్ వేస్తారని స్థానిక పార్టీ నేతలు ప్రకటిస్తూ వచ్చారు. తర్వాత ఈ సమయం మధ్యాహ్నం 1.27 గంటలుగా నిర్ణయించారు. దీంతో పార్టీ కార్యకర్తల్లో కొంత అయోమయం నెలకొంది. చివరకు రెండోసారి నిర్ణయించిన ముహూర్తం ప్రకారమే మధ్యాహ్నం 1.27 గంటలకు భువనేశ్వరి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి జి.శ్రీనివాసులుకు అందించారు. ర్యాలీగా వచ్చిన ఆమె నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే వాహనం నుంచి దిగి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం వెంటరాగా నామినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

నామినేషన్ ఫీజుకు అభిమానుల విరాళాలు

చంద్రబాబు నామినేషన్ ఫీజుకు సంబంధించిన నగదు అభిమానుల నుంచి విరాళాలుగా సమకూరింది. ర్యాలీ ప్రారంభించడానికి ముందుగా భువనేశ్వరిని కలిసిన దివ్యాంగులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు నామినేషన్‌కు కావాల్సిన మొత్తాన్ని ఆమెకు విరాళంగా అందించారు. తమ భవిష్యత్తుకు చంద్రబాబు ద్వారానే భరోసా లభిస్తుందన్న నమ్మకంతో ఆయన గెలిచి తీరాలన్న ఆకాంక్షతో ఈ మొత్తం అందిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు ఆమెతో చెప్పారు.



శ్రేణులకు భువనేశ్వరి అభివాదం



కుప్పం వీధుల్లో టీడీపీ భారీ ర్యాలీ

పసుపు సంద్రం

చంద్రబాబు నామినేషన్ దాఖలుకు వెల్లువెత్తిన జనం



నామినేషన్ ఫీజు కోసం భువనేశ్వరికి విరాళాలు అందజేస్తున్న నిరుద్యోగులు

కుప్పం, ఏప్రిల్ 19 : కుప్పం పసుపు సంద్రమైంది. తమ అభిమాన నేత, భవిష్యత్తు ప్రదాత నారా చంద్రబాబునాయుడి తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులతో కుప్పం వీధులు కిక్కిరిశాయి. 'జై చంద్రబాబు.. జైజై చంద్రబాబు' నినాదాలతో దశదిశలూ పిక్కటిల్లాయి. కుప్పంలో శుక్రవారం చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచే కాకుండా చిత్తూరుతోపాటు ఇతర జిల్లాల నుంచి అభిమానులు వేలాదిగా కుప్పం తరలివచ్చారు. కుప్పం పురపాలక సంఘం లక్ష్మీపురంలోని వరదరాజస్వామివారి ఆలయంలో ఉదయం 10.45 గంటలకు నామినేషన్ పత్రాలను స్వామివారి పాదాల చెంత ఉంచిన భువనేశ్వరి ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మసీదు, చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. ఆయా ప్రార్థనాలయాల్లో పూజారులు, మతపెద్దలు ఆమెకు ఆశీర్వచనం పలికి దీవించారు. అక్కడి నుంచి ఆమె కుప్పం చెరువుకట్ట వద్దకు ఉదయం 11.15 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అప్పటికే నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు వేచి చూస్తున్నాయి. డప్పులు, కోలాటాలు, డీజే శబ్దాల మధ్య నామినేషన్ కేంద్రానికి భారీ ఊరేగింపు బయలుదేరింది. ఓపెన్ టాప్ వాహనం ఎక్కిన భువనేశ్వరి దారి పొడవునా ప్రజలకు, అభిమానులకు అభివాదం చేస్తూ, చిరునవ్వులు చిందిస్తూ ర్యాలీలో సాగారు. మిట్టమధ్యాహ్నం 12 గంటల వేళ ఎర్రటి ఎండ మాడ్చేస్తున్నా ఏమాత్రం లెక్కచేయని జనం ర్యాలీలో ఆమె వాహనం వెంట పరుగులు పెట్టారు. యువత కేరింతలు కొట్టారు. డ్యాన్సులు వేశారు. ఆర్టీసీ బస్టాండు కూడలి వద్దకు ర్యాలీ చేరుకునే సరికి మధ్యాహ్నం ఒంటి గంట అయింది. ఇక్కడ భువనేశ్వరి ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, జన సమూహాన్ని ఉద్దేశించి 15 నిముషాలు ప్రసంగించారు. కుప్పం గడ్డ టీడీపీ అడ్డా అని, ఇక్కడ పసుపు జెండాకు తప్ప మరో జెండాకు స్థానం లేదని గర్జించారు. చంద్రబాబు సీఎం అయితేనే కుప్పంతోపాటు రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని నమ్మడం వల్లే అన్ని వర్గాల ప్రజలు ఆయన నామినేషన్ ఫీజు విరాళాలుగా అందించారని, కుప్పం ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని ప్రకటించారు.

రెండో రోజు 23 నామినేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండో రోజైన శుక్రవారం 23 నామినేషన్లు వచ్చాయి. తొలిరోజు వచ్చిన 15 నామినేషన్లతో కలిపితే ఆ సంఖ్య 38కి చేరింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఆ రోజు నామినేషన్లు తీసుకోరు. శుక్రవారం దాఖలైన నామినేషన్ల వివరాలు ఇలా.. చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గానికి వైసీపీ తరపున ప్రస్తుత ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఆయన సతీమణి రెడ్డెమ్మ రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ తరఫున దుగ్గిరాల నాగేశ్వరరావు నామినేషన్ వేశారు. కుప్పం అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎన్.చంద్రబాబునాయుడు నామినేషన్ వేశారు. పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెండుసెట్లు, ఆయన సతీమణి పి.స్వర్ణలత రెండు సెట్ల నామినేషన్లు వేశారు. పూతలపట్టు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా కలికిరి మురళీమోహన్ ఒక సెట్ నామినేషన్, వైసీపీ తరపున ఎం.సునీల్ కుమార్ రెండు సెట్ల నామినేషన్లు అందజేశారు. గంగాధరనెల్లూరు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా కళత్తూరు కృపాలక్ష్మి రెండు సెట్లు, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా పళ్లిపట్టు గుణశేఖర్ నామినేషన్ అందజేశారు. నగరి అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా ఆర్కే. రోజా రెండుసెట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కె.ధనశేఖర్ శెట్టి నామినేషన్లు దాఖలు చేశారు. పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ తరపున ఎన్.వెంకటే గౌడ, ఆయన సతీమణి ఎన్.పావని, టీడీపీ తరపున ఎన్.అమరనాథరెడ్డి, ఆయన సతీమణి ఎన్.రేణుకా రెడ్డి నామినేషన్ వేశారు.

పలమనేరులో అమర్ దంపతులు





పలమనేరులో నామినేషన్ వేస్తున్న అమరనాథరెడ్డి, రేణుకారెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 19 : పలమనేరులో శుక్రవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఆయన సతీమణి రేణుకారెడ్డి టీడీపీ అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. కాగా గురువారం నామినేషన్ వేసిన పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఆయన సతీమణి పావని మళ్లీ శుక్రవారం రెండవ సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.

పూతలపట్టులో మురళీమోహన్



పూతలపట్టు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ శుక్రవారం నామినేషన్ వేశారు. తన స్వగ్రామమైన గొడుగుచింతలో తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, టీడీపీ నాయకులతో కలిసి సైకిల్‌పై వెళ్లి నామినేషన్ వేశారు.







పోలీసులను నెట్టేసి ఆర్వో కార్యాలయానికి వెళుతున్న వైసీపీ నేతలు - గేట్లు ఎక్కుతున్న వైసీపీ శ్రేణులు

మద్యం తాగుతున్న కార్యకర్తలు

పెద్దిరెడ్డి నామినేషన్ దాఖలులో

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

పుంగనూరు ఆర్వో కార్యాలయంలోకి దూసుకెళ్లిన వైసీపీ నేతలు

గేట్లు దూకి, పోలీసులను నెట్టేస్తూ లోనికి పరుగులు

పుంగనూరు, ఏప్రిల్ 19: పుంగనూరు వైసీపీ అభ్యర్థులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలత శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించాయి. పుంగనూరు శివార్లలోని హనుమంతురాయదిన్నె ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, దర్గాలో ప్రార్థనల అనంతరం భారీ ర్యాలీగా బయలుదేరారు. ఎన్టీఆర్ సర్కిల్, పశువుల ఆస్పత్రి, కోర్టు, ఎంపీడీవో కార్యాలయాల వద్ద పోలీసులు బారికేడ్లు పెట్టి బందోబస్తు ఉన్నారు. అయినా వైసీపీ శ్రేణులు బారికేడ్లను పక్కకు నెట్టి ఆర్వో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అభ్యర్థితోపాటు నలుగురికే అనుమతి ఉందని గేటు వద్ద ఉన్న పోలీసులు చెప్పినా వైసీపీ నాయకులు వినకుండా వారితో వాగ్వాదానికి దిగారు. కొందరు ప్రహరీ గోడ దూకి లోనికి వెళ్లారు. మరికొందరు గేట్లు ఎక్కి, గొడవకు దిగారు. పోలీసులను నెట్టేస్తూ ఆర్వో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. ఈ క్రమంలో పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి, పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, చిన్నగోవిందు ఏమీ చేయలేక చూస్తూ ఉండిపోయారు. మరికొందరు నాయకులు ఎంపీపీ చాంబర్‌లో ఉన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలత ఎన్నికల అధికారి వైమధుసూదనరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ సందర్భంగా ఉదయం 11గంటల నుంచే మదనపల్లె-చిత్తూరు బైపాస్ రోడ్డులో వాహనాలను మళ్లించారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పుంగనూరులో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

విచ్చలవిడిగా మద్యం

పెద్దిరెడ్డి నామినేషన్ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన వైసీపీ నాయకులు విచ్చలవిడిగామద్యం పంపిణీ చేశారు. మార్కెట్ యార్డు, రామసముద్రం రోడ్డు, బసవరాజస్కూల్ ప్రాంతాల్లో జనాన్ని తీసుకొచ్చిన వాహనాలను నిలిపి అక్కడ మద్యం సేవిస్తూ, బిర్యానీ తింటూ చాలా మంది కనిపించారు.

వడదెబ్బతో చిన్నారి మృతి



గుడిపాల, ఏప్రిల్ 19: వడదెబ్బతో చిన్నారి మృతి చెందిన ఘటన గుడిపాల మండలంలో శుక్రవారం చోటుచుసుకుంది. పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో భూపాల్ కుమార్తె తనూజ (7) రెండో తరగతి చదువుతోంది. పాఠశాల నుంచి మధ్యాహ్నం ఇంటికొచ్చిన ఆ చిన్నారి ఎండలో ఆడుకుంటూ సాయంత్రం ఇంటి వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. గుడిపాల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లేలోపే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



చిత్తూరు ప్రకాశం హైరోడ్డులో గొడుగు నీడలో మహిళలు

భగ్గుమంటున్న జిల్లా

తవణంపల్లెలో 44.4 డిగ్రీలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 19: జిల్లాలో ఎండల తీవ్రత శుక్రవారం మరింత పెరిగింది. కుప్పం, నింద్ర, పెద్దపంజాణి, సోమల, శ్రీరంగరాజపురం, తవణంపల్లె, గంగవరం మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయని వాతావరణ శాఖ ప్రకటించింది. తవణంపల్లెలో 44.4, నింద్రలో 44 డిగ్రీలు నమోదయ్యింది. అలాగే శ్రీరంగరాజపురంలో 43.4, సోమలలో 43.2, బంగారుపాళ్యంలో 42.2, గుడిపాలలో 41.9, పులిచెర్లలో 41.8, గంగవరంలో 41.7 వంతున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. చల్లగా ఉండే కుప్పంలోనూ 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం విశేషం.

నారా భువనేశ్వరి నేటి పర్యటన వివరాలు

కుప్పం, ఏప్రిల్19: చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం ఉదయం 9.00 గంటలకు సామగుట్టపల్లె సమీపంలోని కదిరి నరసింహస్వామి ఆలయంలో చంద్రబాబు జన్మదినం పురస్కరించుకుని పూజలు చేయనున్నారు. 10 నుంచి 12.00 గంటల వరకు కుప్పం టీడీపీ కార్యాలయ ఆవరణలో ముస్లిం మైనారిటీ మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. 12 నుంచి ఒంటి గంట మధ్య చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కుప్పం ఆర్టీసీ బస్టాండు కూడలిలో పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా అన్నదానం చేస్తారు. సాయంత్రం 4 గంటలకు కుప్పం నుంచి బెంగళూరు ఎయిర్ పోర్టుకు పయనమవుతారు.

టీడీపీకి ఓటేద్దాం.. అభివృద్ధికి చోటిద్దాం



బిరుగుండ్లపల్లెలో ఆనందరెడ్డి ప్రచారం

రామకుప్పం, ఏప్రిల్ 19: టీడీపీకి ఓటు వేసి గ్రామాల్లో అభివృద్ధికి చోటు ఇద్దామని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన మండల పరిధిలోని బిరుగుండ్లపల్లెలో శంఖారావం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటా ప్రచారం చేశారు. వైసీపీ అరాచకం, అవినీతి, దౌర్జన్యాలు పోవాలంటే టీడీపీని ఆదరించాలన్నారు. చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు రమేష్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ నేతలు బలవంతంగా కండువాలు కప్పారు'



వినాయకపురం వాసులను తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నందారెడ్డి

రామకుప్పం, ఏప్రిల్ 19: సుదీర్ఘకాలంగా టీడీపీలో ఉన్న తమకు వైసీపీ నేతలు ఇటీవల బలవంతంగా వారి పార్టీ కండువాలు కప్పారని రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ వినాయకపురానికి చెందిన మళిగప్ప, నారాయణప్ప, పెద్దకాళప్ప, గోవిందు తెలిపారు. శుక్రవారం వారు టీడీపీ సీనియర్ నేత నందారెడ్డి, మాజీ సర్పంచు పెరుమాళ్ సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నందారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

రామకుప్పం, ఏప్రిల్ 19: రామకుప్పం మండలం కెంపసముద్రం గ్రామ సమీపంలో ఈ నెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మిట్టపల్లెకు చెందిన సోమశేఖర్(32) కుప్పం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మిట్టపల్లెకు చెందిన సోమశేఖర్ ఈ నెల 14న సాయంత్రం తన తండ్రి పాపన్నను ద్విచక్రవాహనంలో వి.కోటలో వదిలి ఇంటికి తిరుగుప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో కెంపసముద్రం వద్ద గుర్తుతెలియని వాహనం రావడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య హాజీరా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి ఓటు వేసే వారి వివరాల సేకరణ

సోమల: 85 ఏళ్లు దాటిన వృద్ధుల, వికలాంగుల వివరాలను సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు సేకరించారు. సోమలలోని శివాలయం వీధి, శెట్టివారి వీధిలోని పలువురి నుంచి ఫారం - 12డిలో సంతకాలు సేకరించారు.

జనసేన నాయకుల ప్రచారం

సోమల: మండలంలోని సరస్వతీపురం, నంజంపేటల్లో జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, ఎంపీగా కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

ప్రశాంత జీవనం కోసం టీడీపీని గెలిపించండి



ఎర్రపాపిరెడ్డిగారిపల్లిలో కరపత్రాలు పంచుతున్న పూజారెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 19: చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మరింత మేలు చేకూరుతుందని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కుమార్తె చల్లా పూజారెడ్డి తెలిపారు. శుక్రవారం పులిచెర్ల మండలంలో ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎర్రపాపిరెడ్డిగారిపల్లిలో మండల టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్నికల ప్రచారాన్ని చల్లా పూజారెడ్డి ప్రారంభించారు. పంచాయతీలోని వడ్లపల్లి, గేటుకాడ బెస్తపల్లి, గేటుకాడ కాలనీ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు సామాన్య ప్రజలకు అండగా ఉంటాయన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, చదువుకునే ప్రతి బిడ్డకూ ఏడాదికి రూ.15వేలు అందిస్తామని వివరించారు. అదేవిధంగా పింఛన్లు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పింఛను ఇస్తారని తెలియజేశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని దాదాపు అన్ని సర్వేలు చెబుతు న్నాయన్నారు. పుంగనూరులో చల్లా బాబురెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. చల్లా బాబురెడ్డిని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, ధనంజయ నాయుడు, కుమార్‌రెడ్డి, మహేష్, రమేష్, నవీన్‌రెడ్డి, సునీల్, భరత్‌రెడ్డి, శీను, నాగరాజ, భాషా, గోపినాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రొంపిచెర్ల, ఏప్రిల్ 19: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు మరో 20 రోజులు మాత్రమే ఉందన్నారు. సమయం తక్కువగా ఉందని నాయకులు, కార్యకర్తలు వైసీపీ అరాచకాలను జనంలోకి విస్తృంగా తీసుకెళ్లాలని సూచించారు. జగన్ పాలనలో పెరిగిన నిత్యావసరస్తువులు, విద్యుత్ చార్జీల, బస్సు చార్జీల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. గతంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమ కేసులు ఎదుర్కొన్న వారికి అండగా ఉంటామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉందని తెలియజేశారు. స్వచ్ఛందంగా జనం టీడీపీలో వస్తున్నారని వివరించారు. ప్రజలను పోలింగ్ బూత్ వరకు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ముందు అంతా మంచిరోజులేనని ప్రజలకు వివరించాలని తెలియజేశారు. ముఖ్యంగా ప్రశంత జీవనం కోసం టీడీపీని ఆదరించాలని ప్రచారం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ నెల 22 వతేది పుంగనూరులో నామినేషన్ వేస్తున్నానని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రవికుమార్‌నాయుడు, శేషాద్రినాయుడు, ఓబులేశ్వరరెడ్డి, రఘు, గౌస్‌పీర్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, కరీముల్లా, రామమూర్తి, సహదేవ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



రొంపిచెర్లలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న చల్లా బాబు

టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి



మోటుమల్లెలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 19: టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ నాయకుడు సుందరం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మోటుమల్లెల పంచాయతీలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

చంద్రబాబుతోనే సంక్షేమం



దిగువపల్లెలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, ఏప్రిల్18: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ నాయకులు బోయకొండ సుబ్బు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దిగువపల్లె పంచాయతీలో సుబ్బు ఆధ్వర్యంలో ఇంటింటికీ సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. పుంగనూరు ఎమ్మె ల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి, సోమశేఖర్, బాలాజీ, బాలు, గణపతి, శివ, మణి పాల్గొన్నారు.

సింహ వాహనంపై కాశీవిశ్వేశ్వరుడి చిద్విలాసం

రామకుప్పం, ఏప్రిల్ 19: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు, అమ్మవారితో కలిసి సింహ వాహనంపై విహరించారు. ఉభయదారులు ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి విద్యుద్దీప, పుష్పాలంకృత సింహవాహనంలో అమ్మవారితో కలిసి స్వామి వారు భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరి కాయలు కొట్టి కర్పూరహారతులిచ్చారు. రాత్రి సింహ వాహనోత్సవం ఎదుట రామకుప్పానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

పుంగనూరు రూరల్, ఏప్రిల్19: స్థానిక ప్రైవేటు బస్టాండ్ సమీపంలో వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

సోమల, ఏప్రిల్ 19: మండలంలోని వల్లిగట్ల పంచాయతీ అగ్రహారం వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ సారా విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు. ● పెద్దఉప్పరపల్లెకు చెందిన గోపి కర్ణాటక మద్యం 2 బాటిళ్లు ద్విచక్రవాహనంలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మంత్రి పెద్దిరెడి నామినేషన్ దాఖలు



పుంగనూరు, ఏప్రిల్ 19: పుంగనూరు వైసీపీ అభ్యర్థిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. ఆర్వో కార్యాలయంలో ఎన్నికల అధికారి వైమధుసూదనరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. పెద్దిరెడ్డి రావచంద్రారెడ్డి, ఆయ సతీమణ స్వర్ణలతలు వైసీపీ అభ్యర్థులుగా రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు.

పెద్దపంజాణిలో వైసీపీకి షాక్

పలమనేరు, ఏప్రిల్19 : పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలంలో వైసీపీకి గట్టిదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి, వైసీపీ నాయకుడు పెద్ద పంజాణి మాజీ ఎంపీపీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి చేతులు కలిపారు. ఇటీవల జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఇద్దరూ కలిశారు. ఆ సమయంలో జరిగిన చర్చల్లో టీడీపీలోకి చేరేందుకు విజయభాస్కర్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. ఒకటి రెండు రోజుల్లో చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోవడం ఖాయమైంది. పెద్దపంజాణి మండలంలో దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం విజయభాస్కర్‌రెడ్డిది. ఆయన తండ్రి ఓబుల్‌రెడ్డి పుంగనూరు సమితి అధ్యక్షులుగా పనిచేశారు. ఓబుల్‌రెడ్డి అంటే నేటికీ పుంగనూరు నియోజక వర్గంలోని పాతతరం వారందరికీ సుపరిచితమే. ఇక విజయభాస్కర్‌రెడ్డి అన్న రెడ్డెప్పరెడ్డి ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారి. వైఎస్ హయాంలో పలమనేరు నియోజకవర్గం నుంచి 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప ఓట్లతో ఓటమిపాలయ్యారు. ఓటమి చెందినా ఆయన నీతి, నిజాయితీలను వైఎస్ గుర్తించారు. ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. విజయభాస్కర్‌రెడ్డి కూడా మండలంలో వైసీపీ నాయకుడిగా మంచి పేరు తెచ్చుకొన్నారు. పార్టీల కతీతంగా పెద్ద సంఖ్యలో ఓటుబ్యాంకు వీరి సొంతం. గత ఎన్నికల్లో మండలంలో వైసీపీకి మంచి మెజారిటీ ఓట్లు సాధించడంలో విజయభాస్కరరెడ్డి కీలకపాత్ర పోషించారు. ఎన్నికలయ్యాక ఎమ్మెల్యే వెంకటేగౌడ విజయభాస్కరరెడ్డికి ప్రాధాన్యత లేకుండా చేశారు. ఇంతకాలం వైఎస్‌పై అభిమానంతో వైసీపీలో కొనసాగుతూ వచ్చారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల కారణంగా తన అన్న రెడ్డెప్ప రెడ్డికి సన్నిహితుడుగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరారు. దీంతో తొలుత ఆయన బీజేపీలో చేరాలని ఆలోచన చేసినా టీడీపీవైపే మొగ్గుచూపారు.



మాజీ మంత్రి అమర్, విజయభాస్కర్‌రెడ్డి

మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి టీడీపీలోకి

ఫలించని పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి సంధియత్నాలు

విజయభాస్కర్‌రెడ్డి టీడీపీలోకి వెళ్లిపోతారని మిథున్‌రెడ్డి గ్రహించారు. నెలరోజుల కిందట గోను మాకులపల్లెలోని విజయభాస్కర్ రెడ్డికి ఇంటికి వెళ్లారు. పార్టీని వీడరాదని వెంకటేగౌడ కోసం పనిచేయాలని ఒప్పించేందుకు ప్రయత్నించారు. అయితే తాను ఆలోచించుకొని మళ్లీ చెబుతానని చెప్పడంతో ఇక విజయభాస్కర్ రెడ్డి వైసీపీ వీడనున్నారని మిథున్‌రెడ్డి ఓ నిర్ధారణకు వచ్చారు. ఆయనను పార్టీమారకుండా చూడాల్సి ఉందని తన తండ్రి పెద్దిరెడ్డికి తెలియజేశారు. దీంతో పెద్దిరెడ్డికూడా వారం రోజుల క్రితం విజయ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి నచ్చజెప్పేందుకు యత్నించారు. పెద్దిరెడ్డి చర్చలతో విజయభాస్కర్‌రెడ్డి మెత్త బడ్డారని వైసీపీలోనే కొనసాగుతారని అందరూ భావించారు. అయితే ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీలో చేరాలని రంగం సిద్ధం చేసుకున్నారు. వెంకటే గౌడ ఓటమే లక్ష్యంగా పనిచేయాలని ఓ నిర్ణయానికి వచ్చారు. దీంతో పెద్దపంజాణి మండలంలో వైసీపీకి మెజారిటీ రావడం దాదాపు అసాధ్యమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన గ్యాస్ ట్యాంకర్

పుంగనూరు రూరల్, ఏప్రిల్19: పుంగనూరు - మదనపల్లె మార్గంలోని ఈడిగపల్లెలో ఓ ఇంట్లోకి శుక్రవారం ఓ గ్యాస్ ట్యాం కర్ దూసుకెళ్లింది. ఈడిగ పల్లెకు చెందిన సరస్వతమ్మ ఇల్లు రోడ్డుపక్కనే ఉంది. చిత్తూరు నుంచి గ్యాస్ ట్యాంకర్ అనంతపురం వైపు వెళుతూ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న సరస్వతమ్మ ఇంట్లోకి దూసు కెళ్లింది. ఇల్లు దెబ్బతింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

చంద్రబాబు నామినేషన్‌కు తరలిన రామకుప్పం శ్రేణులు



వీర్నమల తాండా నుంచి వెళ్లిన మహిళలు

రామకుప్పం, ఏప్రిల్ 19: టీడీపీ అధినేత చంద్రబాబు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామినేషన్ దాఖలు సందర్భంగా శుక్రవారం కుప్పంలో నిర్వహించి భారీ ర్యాలీలో పాల్గొనేందుకు రామకుప్పం మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగుయువత అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, సీతాపతి, నాగభూషణం, మనోహర్, కృష్ణానాయక్, గజేంద్ర, మహ్మద్‌రఫీ, సత్తి, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, గంట్లప్పగౌడు, జయశంకర్ రామలింగారెడ్డి, రామకృష్ణప్ప, జేయి తదితరుల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో బస్సులు, జీపులు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల్లో కార్యకర్తలు, మహిళలు తరలి వెళ్లారు. దీంతో గ్రామాలు నిర్మానుష్యంగా కన్పించాయి.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేతకు గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాసులు

శాంతిపురం, ఏప్రిల్ 19: చంద్రబాబు నామినేషన్ కార్యక్రమానికి తరలి వస్తున్న టీడీపీ నేత శ్రీనివాసులు అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చంద్రబాబు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి కుప్పంలో శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. దీనికి ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు మండలంలోని కొలమడుగు పంచాయతీ అమ్మవారిపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయ కుడు శ్రీనివాసులు ఉదయం ద్విచక్ర వాహనంలో కుప్పం బయలుదేరారు. మార్గమధ్యంలో రెడ్లపల్లెవద్ద ప్రమాదవశాత్తు ఆయన వాహనానికి అడ్డంగా కుక్క దూరింది. దీంతో బండి అదుపు తప్పి శ్రీనివాసులు కింద పడ్డాడు. ఆయనకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు చికిత్స నిమిత్తం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధి కోసం బీసీవైని ఆదరించండి





సుశీల సమక్షంలో బీసీవై పార్టీలో చేరిన మహిళలు, చౌడేపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీవై నాయకులు

చౌడేపల్లె, ఏప్రిల్19: పుంగనూరు అభివృద్ధి కోసం బీసీవై పార్టీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు హరిబాబుయాదవ్ కోరారు. శుక్రవారం చౌడేపల్లెలో బీసీవై కరపత్రాలను ఇంటింటికీ పంచారు. బీసీవై అభ్యర్థి రామచంద్రయాదవ్‌కు చెరుకు రైతు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, ఆనంద్, కిరణ్, వెంకటేష్, గిరిబాబు, సత్య, శివ, సుబ్రహ్మణ్యం, శివకుమార్, మున్న పాల్గొన్నారు.

బీసీవైపార్టీలో చేరిన మహిళలు

పుంగనూరు, ఏప్రిల్19: పట్టణంలోని కట్టకిందపాళ్యం, చింతవీధిలోని మహిళలు భారీ సంఖ్యలో బీసీవై పార్టీలో చేరారు. శుక్రవారం ఆ పార్టీ అధినేత రామచంద్రయాదవ్ సతీమణి సుశీల ఆధ్వర్యంలో ఆ పార్టీ తీర్థం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీవై పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను చూసి మహిళలు పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం వైసీపీ అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలను సహించలేక బీసీవై పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు వివరించారు. బీసీవై పార్టీ నాయకులు సాంబమూర్తి, హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికలల్లో బీసీవైపార్టీ అధినేత రామచంద్రయాదవ్‌ను గెలిపించాలని కోరారు. పుంగనూరులో రామచంద్రయాదవ్ గెలిపిస్తే పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తారని తెలియజేశారు. ప్రతి రైతుకు సొంత నిధులతో పాడి ఆవు పంపిణీ చేస్తారని, ప్రతి మండల కేంద్రంలో పాల డెయిరీలు ఏర్పాటు చేస్తారని వివరించారు. వైసీపీ చేస్తున్న అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలను అరికడతారని తెలియజేశారు. నియోజకవర్గంలో ఎలాంటి ఘర్షణలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించడానికి బీసీవై పార్టీని గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం, ఇళ్లపై దాడులు చేసి ధ్వంసం చేసిన సంఘటనలు ప్రజలు ఒకసారి గుర్తుచేసుకోవాలని విన్నవించారు. ఇలాంటి అరాచకపాలన పోవాలంటే రామచంద్రయాదవ్‌ను గెలిపించాలని కోరారు. పుంగనూరులో రౌడీరాజ్యం పోయి ప్రజాస్వామ్యం రావాలని తెలియజేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని విన్నవించారు.



ప్రచారం చేస్తున్న బీసీవై పార్టీ నాయకులు

ఎంఈవో సాయిలీలకు సన్మానం



భైరెడ్డిపల్లె, ఏప్రిల్ 19 : ఈ నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న భైరెడ్డిపల్లె ఎంఈవో సాయిలీలను శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో దేవరాజు మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణలో సాయిలీల క్రమశిక్షణతో పనిచేశారని తెలిపారు. అనంతరం ఎంఈవో దంపతులను డీఈవోతో పాటు ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్డీ రాజేంద్ర బాలాజీ, డీఎస్వో రమణ, వి.కోట ఎంఈవో చంద్రశేఖర్, విశ్రాంత ఎంఈవో కన్నయ్య, పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 12మందికి గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్19: పుంగనూరు - రామసముద్రం మార్గంలోని వనగానిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 12మంది గాయపడ్డారు. అందులో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మండలంలోని సింగిరిగుంట గ్రామానికి చెందిన నాగవేణి, వైశాలి, పద్మావతమ్మ, పార్వతమ్మ, ఎ.గాయత్రి, పుత్తమ్మ, పెద్దరెడ్డెమ్మ, రెడ్డెమ్మ, ఆర్.గాయత్రి, మునెమ్మ, సుజాతలు రామసముద్రం మండలంలోని మినికి వద్ద కూలి పనులకు వెళ్లారు. ఈ నేపథ్యంలో సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి ఆటోలో బయలుదేరారు. వనగానిపల్లె వస్తున్న ఆటోను వెనకవైపు నుంచి మరో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో మునెమ్మ, సుజాతలు తీవ్రంగా గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం 108 లో మదనపల్లెకు తరలించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

టీడీపీ నాయకుడిపై దాడి



దాడిలో గాయపడిన సుబ్బరాజు

కల్లూరు, ఏప్రిల్ 19: పులిచెర్ల మండలం రేణుమాకులపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన వైసీపీ నేతలు రెడ్డెప్ప, వెంకటరమణ తనపై దాడి చేసినట్లు అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుబ్బరాజు శుక్రవారం కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి సమీపంలోని మైదానంలో కొందరు పిల్లలు వాలీబాల్ ఆడుకుంటుండగా రెడ్డెప్ప, వెంకటరమణ అక్కడకు చేరుకుని నెట్ తమ పార్టీ వాళ్లు ఇచ్చారని, తీసేయాలని అన్నారు. తాము పోటీల్లో గెలిచి నెట్ తెచ్చుకున్నామని పిల్లలు తెలిపారు. వాగ్వాదం చోటుచేసుకోగా అక్కడే కూర్చొని ఉన్న తన తలపై రెడ్డెప్ప, వెంకటరమణ రాయితో గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సోనియా కాళ్లే పట్టుకోలేదు.. నీకాళ్లు పట్టుకుంటానా..?

మాజీ సీఎం కిరణ్ వ్యాఖ్యలపై మంత్రి పెద్దిరెడ్డి ఆగ్రహం

పుంగనూరు, ఏప్రిల్ 19: 'పదవుల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కాళ్లే పట్టుకోలేదు, ఇక నీ కాళ్లు పట్టుకొనే దుస్థితి నాకు రాలేదు' అని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చిత్తూరు జిల్లా పుంగనూరులో వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరణ్ కుట్రలు చేసి చిదంబరం కాళ్లు పట్టుకుని పదవి పొందారని ఆరోపించారు. పుట్టపర్తిలో సత్యసాయిబాబా చనిపోతే శవాన్ని 10 రోజులు అడ్డుపెట్టుకుని బంగారాన్ని లారీల్లో బెంగళూరుకు తరలించి కిరణ్‌కుమార్‌రెడ్డి, చిదంబరం భాగాలు పంచుకున్నారని ఆరోపించారు.

రోజా నామినేషన్‌కు... అసమ్మతి నాయకుల డుమ్మా

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 19: వైసీపీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా రోజా నామినేషన్ కార్యక్రమానికి అసమ్మతి నాయకులు డుమ్మా కొట్టారు. శుక్రవారం ఆమె నగరిలో నామినేషన్ దాఖలు చేశారు. కీలక నాయకులు మొహం చాటేయడంతో ఆ పార్టీలోని అంతర్గత విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. నిండ్రకు చెందిన శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, పుత్తూరుకు చెందిన మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్ (అమ్ములు), వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నగరికి చెందిన కేజే కుమార్ దంపతులు, విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు, పుత్తూరు రూరల్‌కు చెందిన రవిశేఖర్‌రాజు రోజాతో పలు సందర్భాల్లో విభేదించారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం పలుమార్లు ఇరువర్గాలను కలిపే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. అంతేగాక రోజాకు టికెట్ ఇవ్వొద్దని అసమ్మతి నాయకులు పలుమార్లు అధిష్ఠానానికి మొరపెట్టుకున్నా లాభం లేకపోయింది. దీంతో వారు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

ముగిసిన సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 19: జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 6న ప్రారంభమైన సమ్మేటివ్ అసెస్మెంట్-2 (వార్షిక) పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహించిన ఈ పరీక్షలు ముగియడంతో జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ చేపట్టారు. శని, సోమవారాల్లో మూల్యాంకనం పూర్తి చేసి, వార్షిక ప్రోగ్రెస్ రిపోర్టును తయారు చేసి, విద్యా సంవత్సరం చివరి రోజైన ఈ నెల 23న విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ మేరకు డీఈవో దేవరాజు ఎంఈవోలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు.

ఖర్చులను జాగ్రత్తగా నమోదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలకు సంబంధించి ప్రతి ఖర్చునూ జాగ్రత్తగా రికార్డులో నమోదు చేయాలని ఎన్నికల పరిశీలకులు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్నికల నిర్వహణపై జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ షన్మోహన్ వివరించారు. ఎన్నికల పరిశీలకులు శంకర్ ప్రసాద్ శర్మ, ఎస్.శ్రీనివాస్ ఖన్నా, రోహన్ ఠాకూర్ మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను జాగ్రత్తగా తనిఖీ చేయాలన్నారు. తనిఖీల సమయంలో వీడియో కవరేజ్ చేయించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు, వెబ్‌కాస్టింగ్, వీడియో కవరేజ్ ఏర్పాటు చేశామన్నారు. సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద లోపల, బయట వీడియో కవరేజ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ఎల్‌ఎం హరీష్, ఎన్నికల పరిశీలకుల నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి, డీఎస్పీ శరవణ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఇతర నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి, రోజా ఆస్తుల వివరాలు ఇలా..

చిత్తూరు (ఆంధ్రజ్యోతి), ఏ ప్రిల్ 19 : మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా శుక్రవారం నామినేషన్ వేశారు. అందులో వారు పేర్కొన్న ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి..

రోజా స్థిర, చరాస్తులు 10.63 కోట్లు

నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా తన మొత్తం ఆస్తుల విలువ రూ.10.63కోట్లుగా పేర్కొన్నారు. చరాస్తులు రూ.4.58 కోట్లు, స్థిరాస్తులు రూ.6.05 కోట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే ఆమెకు రూ.1.59 కోట్లు విలువ చేసే నాలుగు కార్లు ఉన్నాయి. రూ.కోటి విలువ చేసే బెంజ్ కారు ఉంది. దాన్ని కొనేందుకు రూ.94లక్షలు బ్యాంక్ ద్వారా రుణం తీసుకున్నట్లు చూపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నగరి నియోజకవర్గంలో 6.39 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఆమె మీద 2019 ఎన్నికల సమయం నాటికి కేసులు ఉండగా.. ఇప్పుడు కేసులేం లేవు.

మంత్రి పెద్దిరెడ్డి, ఆయన సతీమణి పేరుతో భారీ ఆస్తులు

మంత్రి పెద్దిరెడ్డి పేరుతో చరాస్తులు రూ.10.59 కోట్లు, ఆయన సతీమణి పేరుతో రూ.14.55 కోట్లు ఉన్నాయి. అలాగే స్థిరాస్తులు పెద్దిరెడ్డి పేరుతో రూ.114.25కోట్లు, ఆయన సతీమణి పేరుతో రూ.96 కోట్లు ఉన్నాయి. పెద్దిరెడ్డి పేరుతో రూ.18.50 కోట్ల అప్పులు, ఆయన సతీమణికి రూ.34.74 కోట్ల అప్పులు ఉన్నాయి. రూ.14.15 కోట్లు విలువ చేసే వ్యవసాయ భూములు, రూ.1.37కోట్లు విలువ వ్యవసాయేతర భూములు పెద్దిరెడ్డి పేరుతో ఉన్నాయి. ఆయన భార్య పేరుతో రూ.8.92కోట్లు విలువ చేసే వ్యవసాయ భూములు, రూ.22.50 కోట్లు విలువ వ్యవసాయేతర భూములు ఉన్నాయి.

అమ్మవారి ఆలయంలో పరిచారకుడి దాష్టీకం

- భక్తురాలితో అసభ్య ప్రవర్తన
- ఆలస్యంగా వెలుగులోకి ● గతంలోనూ ఇదే తంతు

తిరుచానూరు, ఏప్రిల్ 19: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఓ పరిచారకుడి దాష్టీకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐదు రోజులక్రితం తమిళనాడుకు చెందిన ఓ కుటుంబం అమ్మవారి దర్శనానికి వచ్చింది. వీరు దర్శనానంతరం అమ్మవారి తీర్థం, శఠారి కోసం వెళ్లారు. చివర్లో వస్తున్న ఆ కుటుంబానికి చెందిన ఓ మహిళ తలపై శఠారీ పెడుతూ.. అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాధితురాలు కన్నీరుపెడుతూ కుటుంబీకులు తెలిపింది. వారు అక్కడ విధి నిర్వహణలో ఉన్న అధికారికి ఫిర్యాదు చేశారు. దీన్ని గమనించిన పరిచారకుడు కూడా వచ్చి బాధిత కుటుంబీకులతో బెదిరింపు ధోరణితో మాట్లాడటమే కాకుండా వాగ్వాదానికి దిగాడు. దాంతో బాధితురాలు జరిగిన విషయాన్ని ఆలయ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఆలయాధికారులు గోప్యంగా ఉంచడంపై విమర్శలొస్తున్నాయి. గతంలోనూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఓ ఆలయంలోనూ భక్తురాలిపై ఇదే పరిచారకుడు అసభ్యంగా ప్రవర్తిస్తే ఆమె కుటుంబీకులు చితకబాదారని సమాచారం. అలాంటి పరిచారకుడికి తిరుపతికి చెందిన ఓ వైసీపీ ప్రజాప్రతినిధి, టీటీడీ బోర్డులో ఉన్న వ్యక్తి సిఫార్సుతో మూడు నెలల క్రితం అమ్మవారి ఆలయంలో బాధ్యతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై ఆలయ అధికారులను వివరణ కోరగా.. పరిచారకుడిపై చర్యలు తీసుకుంటున్నామని, అతడిని ఆలయంలోకి రానీయడం లేదని చెప్పారు.

చంద్రబాబు విజనరీ నాయకుడు

- రాష్ట్రానికి ఆయన నాయకత్వమే శరణ్యం ● వైసీపీ పాలనలో అంతా అంధకారం
- కుప్పం ప్రతిభావంతులతో నారా భువనేశ్వరి



ప్రతిభావంతుల సమావేశంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం, ఏప్రిల్ 19: 'చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు. రాష్ట్రానికి ఇప్పుడు ఆయన నాయకత్వం ఎంతో అవసరం. వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రంలో అంధకారం నెలకొంది. ఈ చీకట్లు తొలగి అభివృద్ధి వెలుగులు విరియాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తీరాలి. అందుకు మీ అందరి సహకారం కావాలి.' అని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలో శుక్రవారం చంద్రబాబు తరఫున నామినేషన్ దాఖలు చేసిన ఆమె స్థానిక టీడీపీ కార్యాలయం ప్రాంగణంలో నియోజకవర్గ ప్రతిభావంతులతో సమావేశమయ్యారు. కుప్పంలో అనేకమంది ప్రతిభావంతులున్నారని, వారి వద్దకు అనేకమంది రోజూ వస్తుంటారని, చంద్రబాబు విజనరీ లక్షణాలను వివరించి టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఆయన విజన్‌తోనే ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీ వచ్చిందన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబుమీద నమ్మకంతోనే అనేక పరిశ్రమల స్థాపనకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారని చెప్పారు. రైతుల నుంచి భూములు సేకరించి అమరావతి నిర్మాణాన్ని చంద్రబాబు చేపడితే ఆ రైతులను వైసీపీ ప్రభుత్వం వేధించిందని, చంద్రబాబు మీద కక్షతో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చేసిందని విమర్శించారు. చంద్రబాబు మీద అనేక తప్పుడు ఆరోపణలు చేసి, వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కదాన్ని కూడా నిరూపించలేకుండా ఉన్నన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు అండగా నిలబడడంవల్లే తాను నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించగలిగానన్నారు.

- **చంద్రబాబు పాలనలో అభివృద్ధి ఫలాలు :** చంద్రబాబు పాలనలో అభివృద్ధి ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందే సమయానికి మోసకారి మాటలతో అనేక సమస్యలను కొని తెచ్చుకున్నామని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. రాయలసీమ నీటి సమస్య తొలగిపోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అనివార్యమని చెప్పారు. చంద్రబాబుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు సకల వర్గాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ ఎంపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ, సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేశ్, వీజీ.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులతో ముఖాముఖి

దండపాణి, పాస్టర్ల అసోసియేషన్ ప్రతినిధి : సీఎం జగన్ క్రైస్తవులంటే అభిమానమని చెప్పుకుంటారు. కానీ క్రైస్తవ, మైనారిటీల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. మాకు బరియల్ గ్రౌండ్‌కు రెండు ఎకరాలు కేటాయించాలి. సదుపాయలు కల్పించాలి. చంద్రబాబు నిర్మించి ఇచ్చిన భవనాన్ని మరమ్మతు చేయాలి.

- **భువనేశ్వరి:** వైసీపీ పాలనలో శ్మశాన స్థలాలను, భూములను కబ్జా చేస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక క్రైస్తవులకు అవసరమైన అన్ని సదుపాయలు కల్పిస్తాం.

పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధి: నేను విశ్రాంత ఉపాధ్యాయుడిని. వైసీపీ ప్రభుత్వం మాకు రావాల్సిన కోట్లాది రూపాయల ప్రయోజనాలను పెండింగులో పెట్టింది. విడుదలకు చర్యలు తీసుకోవాలి. పెన్షనర్ల అసోసియేషన్‌కు భవనం నిర్మించాలి.

- **భువనేశ్వరి:** టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ల బకాయిలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వారికోసం భవనం నిర్మించి ఇస్తాం.

ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి: 2014 నుంచి ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్నాం. కేవలం 10 వేలకు మా వేతనం మించడంలేదు. మంచి జీతాలతో ఉద్యోగ భద్రత కల్పించాలి.

- **భువనేశ్వరి:** చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అవర్ బేస్డ్ ఫ్యాకల్టీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

డాక్టర్ మంజునాథ్: మా కుటుంబంలో అందరం డాక్టర్లమే. చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహమే దీనికి కారణం. నియోజకవర్గంలోని ఆసుపత్రుల్లో డాక్టర్లు సరిగా లేరు. వెంటనే నిపుణులైన డాక్టర్లను నియమించాలి.

- **భువనేశ్వరి:** కుప్పంలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసింది చంద్రబాబు నాయుడే. టీడీపీ హయాంలో కేవలం ఏరియా ఆసుపత్రిలోనే కాకుండా మండలాలలోని పీహెచ్‌సీలలో సైతం డాక్టర్లు ఉండేవారు. కరోనా సమయంలో ప్రతిపక్షంలో ఉండికూడా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా 3 ఆక్సిజన్ ప్లాంట్లను అందించాం. అధికారంలోకి రాగానే డాక్టర్ల భర్తీకి చర్యలు తీసుకుంటాం.

న్యాయవాది శ్రీకాంత్: వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంవల్ల బడుగు బలహీన వర్గాలకు చాలా నష్టం జరుగుతోంది. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- **భువనేశ్వరి:** వైసీపీ అరాచకాలకు అంతులేదు. రాష్ట్ర ప్రజలు ప్రతిరోజూ తమ ఓట్లు జాబితాలో ఉన్నాయో లేవో చూసుకోవాల్సి వస్తున్నట్లే, రైతులు కూడా తమ భూములున్నాయో లేవో చూసుకోవాల్సిన దుస్థితి దాపురించింది. లోపభూయిష్టమైన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని చంద్రబాబుతో చెప్పి రద్దు చేయిస్తాం.

మునస్వామి, సామాజిక కార్యకర్త: కుప్పం నుంచి ఉపాధికోసం ఇక్కడి ప్రజలు బెంగళూరుకు వెళ్తున్నారు. పరిశ్రమల సంఖ్య పెంచాలి. మహిళలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

- **భువనేశ్వరి:** ఇప్పుడున్న పరిశ్రమలు చంద్రబాబు స్థాపించినవే. మనం అధికారంలోకి వచ్చాక అవసరమైతే మరిన్ని పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటాం. మహిళా శక్తిని గుర్తించి ప్రోత్సహించింది మొదట ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు.

ఆర్ఎంపీ డాక్టర్ల ప్రతినిధి: గ్రామీణ వైద్యులుగా ఆర్ఎంపీలకు గుర్తింపు ఇవ్వాలి. మాకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో మమ్మల్ని పట్టించుకోలేదు.

- **భువనేశ్వరి:** న్యాయమైన ఆర్ఎంపీల సమస్యను చంద్రబాబు తప్పకుండా పరిష్కరిస్తారు.

మీ ఓటే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది

కుప్పం, ఏప్రిల్ 19: 'మీరు ఈ ఐదేళ్లపాటు చాలా దౌర్జన్యాలు చవిచూశారు. దాడులు ఎదుర్కొన్నారు. అనేక కష్టనష్టాలకు ఓర్చి చంద్రబాబుకు అండగా నిలబడ్డారు. ఇక పట్టుమని ఇరవై రోజులు. ఎన్నికల్లో మీ సత్తా చూపండి. మీ ఓటు మాత్రమే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది. చంద్రబాబు లాంటి మచ్చ లేని, సమర్థత కలిగిన నాయకత్వాన్ని రాష్ట్రానికి అందిస్తుంది.' అని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబునాయుడు తరఫున కుప్పంలో శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన ఆమె, అంతకుముందు టీడీపీ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ప్రజలను, పార్టీ శ్రేణులను ఉద్దేశించి పదిహేను నిముషాలు ప్రసంగించారు. ఎప్పటికీ కుప్పం టీడీపీ అడ్డాయేనన్నారు. పసుపు జెండాకు తప్ప ఇక్కడ మరో జెండాకు స్థానం లేదని గర్జించారు. చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు నిజం గెలవాలి అంటూ సాగించిన పర్యటనలో కుప్పం వచ్చిన సమయంలో తనమీద, చంద్రన్న మీద కుప్పం ప్రజలు చూపిన అభిమానం వెలకట్టలేనిదన్నారు. ఈసారి ఆయన్ను లక్ష మెజారిటీతో గెలిపించి సత్తా ఏమిటో చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నామినేషన్ ఫీజు కోసం దివ్యాంగులు, మహిళలు, నిరుద్యోగులు, చివరకు విద్యార్థులు సైతం విరాళాలు ఇస్తుంటే తన మనసు పులకించిపోయిందన్నారు. చంద్రబాబు మీద నమ్మకమే పెట్టుబడిగా రాష్ట్రానికి వచ్చిన ఎన్నో పరిశ్రమలు, వైసీపీ అరాచక పాలనను తట్టుకోలేక వెనక్కు వెళ్లిపోయాయని విమర్శించారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడంతోపాటు కుప్పానికి ప్రత్యేక స్థానం కల్పించడం ఆయన ధ్యేయమన్నారు. చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పుత్తూరు బైపాస్‌లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం

మున్సిపల్ వైస్ చైర్మన్ సమీప బంధువు అరెస్ట్ - వైసీపీ నాయకులే డంప్ చేశారన్న అనుమానాలు



స్వాధీనం చేసుకున్న మద్యం,ముద్దాయిలతో పోలీసులు

పుత్తూరు అర్బన్/నారాయణవనం, ఏప్రిల్ 19: నారాయణవనం మండల పరిధిలోని కల్యాణపురం వద్ద గురువారం రాత్రి భారీ మద్యం డంప్‌ను పోలీసులు సీజ్ చేశారు.సీఐ భాస్కర్ నాయక్ కథనం మేరకు...పుత్తూరు బైపాస్ రోడ్డులోని కల్యాణపురం వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోలో 46 మద్యం కేసులను తరలిస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ గుర్తించారు. విచారణలో స్థానికుడైన శివ లీజుకు తీసుకుని నడిపిస్తున్న ఎస్ఎస్ఎస్ వెయింగ్ మెషిన్ వద్ద 239 మద్యం కేసులు నిల్వ ఉంచి, అక్కడి నుంచి మరొక చోటకు తరలిస్తున్నట్లు తేలింది.మద్యాన్ని అక్కడ నిల్వ చేసిన సీఎస్ దిలీప్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. దీంతో మొత్తం 285 మద్యం కేసులతో పాటు తిరునావక్కరసు, లీలాకృష్ణ, శివతో పాటు మద్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.అయితే మద్యం డంప్ వ్యవహారంలో అన్ని వేళ్లూ అధికార పార్టీ వైపే చూపిస్తున్నాయి.మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్న వారిలో ఒకరు పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సమీప బంధువు తిరువనావక్కరసు కాగా మరొకరు ఆటో డ్రైవర్. వీరిని ప్రశ్నించిన పోలీసులకు వేబ్రిడ్జి గదిలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 239 కేసుల కర్ణాటక మద్యం గురించి తెలిసింది. ఇంత భారీస్థాయిలో మద్యం నిల్వ చేయడం వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే పోలీసులు అరెస్ట్ చేసిన తిరువనాక్కరసు గేటు పుత్తూరులో వైసీపీ నాయకుడిగా ఉన్నారు.ఈయన బంధువు శంకర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. పైగా పోలీసులు చెబుతున్నట్లు మద్యం డంప్ దొరికిన వేబ్రిడ్జి కూడా మరో వైసీపీ నాయకుడిదిగానే తెలుస్తోంది. కర్నాటక మద్యాన్ని ఎన్నికల కోసమే డంప్ చేసి ఉంచారనే ప్రచారం సాగుతోంది. ఇటీవల వైసీపీ నాయకులు నియోజకవర్గవ్యాప్తంగా మామిడి తోటల్లో విందు సమావేశాలు నిర్వహించారు. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికీ మద్యం సరఫరా చేసినట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఎన్నికల ప్రచారానికి వచ్చే వారికి, సభలు, సమావేశాలకు హాజరయ్యే కార్యకర్తలకు మద్యం సరఫరా చేస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి నియోజకవర్గంలో అధికార పార్టీ మద్యాన్ని ఏరులైపారిస్తోందనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి భారీ స్థాయిలో మద్యం దిగుమతి చేసుకుని ఆయా మండలాల్లో డంప్‌లను ఏర్పాటు చేసుకున్నట్లు కూడా సమాచారం. చీప్ లిక్కర్‌తో పాటు బ్రాండెడ్ మద్యాన్ని కూడా స్టాక్ చేసి ఉంచినట్లు తెలుస్తోంది. అయితే అధికార పార్టీ కావడంతో విషయం తెలిసినప్పటికీ ఎన్నికల అధికారులతో పాటు పోలీసులు సైతం అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే మాటలు వినబడుతున్నాయి.కాబట్టే ఈ కేసులో సూత్రధారులను వదిలి చిన్న చేపల అరెస్ట్‌కే పోలీసులు పరిమితమైనట్లు ప్రచారం జరుగుతోంది.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.35 కోట్లు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 19: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,35,78,424 లభించింది. ఈవో వెంకటేశు పర్యవేక్షణలో శుక్రవారం హుండీ కానుకలను లెక్కించారు. 941 యూఎస్ఏ, 10 కెనడా, 20 సింగపూర్ డాలర్లు, 10 ఇంగ్లండు పౌండ్లు, 4 మలేసియా రింగిట్స్, 25 యూరోలు, 1,055 సౌదీ రియాల్స్‌తోపాటు 32 గ్రాముల బంగారు, 970 గ్రాముల వెండి లభించాయి. అలాగే గో సంరక్షణ హుండీ ద్వారా రూ.7,735, నిత్యాన్నదాన సత్రం వద్ద ఉన్న హుండీ ద్వారా 28,555, డీడీల రూపంలో 2,94,701 సమకూరాయి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి వాణి, ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మల్లికార్జున, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బోయకొండలో రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఏప్రిల్ 19: ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

పది ఆర్వో ప్లాంట్ల సామగ్రి సీజ్



వివరాలు తెలియజేస్తున్న ఎన్నికల అధికారులు



స్వాధీనం చేసుకున్న ఆర్వో ప్లాంట్ల సామగ్రి

పాకాల, ఏప్రిల్ 19: పది ఆర్వో ప్లాంట్లకు సంబంధించిన సామగ్రిని అధికారులు సీజ్ చేశారు. పాకాల మండలంలోని నేండ్రగుంట నుంచి ఆర్వో ప్లాంట్ల సామగ్రిని పంపిణీ చేస్తుండటంతో టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. కోడ్ అమలులో ఉండగా వైసీపీ నాయకులు ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. కంటైనర్లలో వచ్చిన సామగ్రిని అప్పటికే రెండు, మూడు ట్రాక్టర్లలో తరలించేశారని చెప్పారు. టీడీపీ నాయకుల ఫిర్యాదుతో తహసీల్దార్ వాణిశ్రీ, ఎంపీడీవో నాగేంద్రబాబు, సీఐ రాజగోపాల్ కంటైనర్ల వద్దకు చేరుకున్నారు. కంటైనర్లలో వచ్చిన సామగ్రిని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే ట్రాక్టర్లలో తరలివెళ్లిన సామగ్రిని కూడా వెనక్కి రప్పించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సామగ్రిని పోలీసులకు అప్పగిస్తున్నట్లు, కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సమాచారం అందిస్తామన్నారు. నిబంధనల మేరకు ఉంటే ఎన్నికల తర్వాత రిలీజ్ చేస్తామని లేకుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తామన్నారు. హైదరాబాదుకు సంబంధించిన కాంట్రాక్టర్ ఈ మెటీరియల్ సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు.



దాహంతో ఊళ్లోకొచ్చింది

ఎండలకు అటవీ ప్రాంతంలో నీరు లభించక శుక్రవారం ఒక నెమలి పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గొబ్బిళ్లకోటూరు గ్రామంలోకి వచ్చింది. టీడీపీ నేత గణేష్ ఇంటి వద్దకు రావడంతో ఆయన దాన్ని చేరదీసి, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. పలమనేరు అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు నీటికోసం అలమటిస్తున్నాయని, అందుకే ఏనుగులు తరచూ పంట పొలాల వద్దకు వస్తున్నాయని రైతులు అంటున్నారు.

- పలమనేరు

ఎగసిపడిన అగ్నికీలలు

నాలుగు రోజులుగా కాలుతూనే ఉన్న శేషాచలం అడవి



శ్రీగంధం వనానికి సమీపంలో ఎగసిపడుతున్న మంటలు

తిరుమల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. నాలుగురోజుల క్రితం మొదలైన మంటలు క్రమంగా వ్యాప్తిచెందుతూ తిరుమలకు సమీపానికి వచ్చి బెంబేలెత్తించాయి. మామండూరుకు సమీపంలోని అడవిలో మంగళవారం మొదలైన మంటలు క్రమంగా సానరాళ్ల బండ వైపుగా వస్తుండటంతో అటవీ ప్రాంతం భారీగా కాలి బూడిదైంది. శుక్రవారం కాకులకొండ మీదుగా పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం, శ్రీగంధవనం వైపుగా మంటలు వ్యాపించి.. అక్కడి అడవి అగ్నికి ఆహుతైంది. గాలులు కూడా జోరుగా వీస్తుండటంతో క్షణాల వ్యవధిలోనే మంటలు వ్యాపిస్తూ పాపవినాశనం రోడ్డుకు, శ్రీగంధం వనానికి సమీపంలోకి వచ్చేశాయి. ఈ ప్రాంతాలను భారీగా పొగ కమ్మేసింది. మంటలు తిరుమల సమీపానికి వస్తున్న క్రమంలో టీటీడీ ఫారెస్ట్, ప్రభుత్వ ఫారెస్ట్, విజిలెన్స్, ఫైర్ ఫైటర్స్, ప్రభుత్వ ఫైర్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. వీరు సకాలంలో అప్రమత్తం కాకుంటే మంటలు రోడ్డు దాటి తిరుమలవైపుగా వచ్చి.. భారీ ప్రమాదం వాటిల్లి ఉండేది.

500 హెక్టార్ల అడవి కాలిపోయి ఉండవచ్చని అంచనా

దాదాపు 500 హెక్టార్ల అడవి కాలిపోయి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వందల ఎకరాల్లోని అటవి మసిబారిపోయింది. అలాగే మంటలు భారీగా ఎగసిపడిన నేపథ్యంలో రెండు చిరుతలతోపాటు నాలుగు ఎలుగుబంట్లు పరుగులు తీస్తూ అటవీశాఖ సిబ్బంది కంటపడ్డాయి. అనేక వన్యప్రాణులు మంటల నుంచి దూరంగా పారిపోయాయి. కాగా, మంటలు తిరుమల దిశగా రాకుండా కాంటూర్స్‌ని అధికారులు మరింత విస్తరింపజేశారు.





అడవి నుంచి భారీగా వస్తున్న పొగ - కాలిపోయిన అడవి

వాట్సప్ కాల్ అయితేనే..



● గాసిప్

వాట్సప్ కాల్ అయితేనే మాట్లాడతాం. లేదంటే లేదంటూ తెగేసి చెప్పేస్తున్నారు నగరి నియోజకవర్గ వైసీపీ అసమ్మతి నేతలు. ఏం మాట్లాడితే ఎవరు రికార్డుచేసి అగ్ర నాయకులకు చేరవేస్తారేమోనని హడలిపోతున్నారు. ఎందుకొచ్చిన గొడవని వాట్సప్ కాల్‌లో మాత్రమే మాట్లాడుతున్నారు. ఇటీవల పుత్తూరు మున్సిపల్ కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉన్నట్లు పెద్దలకు ఉప్పు అందింది. దీంతో తమ నమ్మకస్తుడైన మరో కౌన్సిలర్‌ను చక్కదిద్దమని పురమాయించారు. ఆ కౌన్సిలర్ పలుమార్లు ఫోన్ చేస్తున్నా అసంతృప్త కౌన్సిలర్లు స్పందించలేదు. వాట్సప్ కాల్‌లో మాత్రమే మాట్లాడతామని తెగేసి చెప్పారు. సన్నిహితులతోనూ చాలామంది వాట్సప్ కాల్స్ ద్వారానే మాట్లాడుతున్నారు.

- పుత్తూరు అర్బన్

ఇదీ మందు

నాయకుడంటే ఈయన!



● పాదముద్రలు

రెండేళ్లు సర్పంచ్‌గా చేస్తేనే భూములు మేడలు ఎనకేసుకునే నాయకులన్న కాలంలో రెండు చేతులూ జోడించి గుర్తు చేసుకోవాల్సిన పేరు టీసీ రాజన్. ఎన్జీ రంగా అనుచరుడు అయిన ఈయన 1967లో పలమనేరు నుంచి స్వతంత్ర్య పార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభర్థి బీఎల్ఎన్ నాయుడిపై 9561 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఐదేళ్లు శాసనసభ్యుడిగా పనిచేసిన రాజన్‌కి సెంటు భూమి లేదు. సొంతంగా జానెడు ఇల్లు లేదు. బెంగళూరులో, హైదరాబాద్‌లో, తాడేపల్లిలో ప్యాలెస్‌లు నిర్మించుకునీ పేదలమంటూ చెప్పకునే నాయకులు సిగ్గుపడేలా ఆదర్శంగా జీవిస్తున్నారు రాజన్. స్వాతంత్ర్య సమరయోధుడు కూడా అయిన ఈయన ప్రభుత్వ పెన్షన్‌తోనే సరిపెట్టుకుంటున్నారు. రాజన్ వయసు 107 ఏళ్లు. భార్య చనిపోయి పదేళ్లయింది. ప్రస్తుతం బెంగళూరులోని చిన్న కుమారుడి దగ్గర ఉంటున్నారు. నెలరోజుల క్రితం రోడ్డుప్రమాదంలో ఆయన చిన్నకుమారుడు, కోడలు దుర్మరణం చెందారు.

- పలమనేరు

అధికారం ఎటుంటే అటు



● జంపింగ్ జపాంగ్స్

అధికారం ఎటుంటే అటు వెళ్లడం.. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఊహించి ముందుగానే ఫిరాయించడం కొందరికి అలవాటు. ఇలా చిత్తూరులోని ఇద్దరు నేతలు పార్టీ కండువాలు మార్చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆ ఇద్దరు టీడీపీలో కార్పొరేటర్లుగా ఎన్నికై ఐదేళ్లు కొనసాగారు. టీడీపీ అధికారం కోల్పోయాక వెంటనే పార్టీని వీడి.. వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. అక్కడ నగరపాలక సంస్థలో కో- ఆప్షన్ సభ్యులుగా అవకాశం దక్కించుకున్నారు. నాలుగేళ్లకుపైగా ఆ పదవుల్లో కొనసాగిన వీరు.. వారం కిందట అధికార పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఈ సారి ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందన్న బలమైన ప్రచారం ఉండటం.. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పసిగట్టి వీరు ముందుగానే సొంతగూటికి చేరారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

- చిత్తూరు

నమ్మించి.. వంచించి..!

● అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని జగన్ ● ఆందోళన చేస్తే కఠినంగా అణచివేత

తలమీద చేయి పెట్టారు. మీ జీవితాల్లో వెలుగులు నింపుతానని చెప్పారు. అధికారంలోకి తానొస్తే తెలంగాణకంటే రూ.వెయ్యి ఎక్కువ జీతం ఇస్తానంటూ నమ్మించారు. ఆ మాటలకు పొంగిపోయిన అంగన్వాడీలు.. గత ఎన్నికల్లో జగన్‌కు వెన్నంటి నిలిచారు. అధికారంలోకి వచ్చాక.. అన్ని వర్గాల్లాగే వీరినీ మోసం చేశారు.

- చిత్తూరు



తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ చిత్తూరులో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్ ఫొటో)

ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేసిన వైఎస్ జగన్.. అందరికిలాగే చిరువేతన జీవులైన అంగన్వాడీలకూ ఎన్నో హామీలిచ్చారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న సిబ్బందికి అండగా ఉంటానన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు జీతాన్ని పెంచుతామన్నారు. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రం అక్కడి అంగన్వాడీలకు ఇచ్చే జీతంపై అదనంగా రూ.వెయ్యి ఇస్తానన్నారు. ఇలాంటి హామీలతో అంగన్వాడీల ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చూపారు. జగన్ అధికారంలోకి రాకముందు అంగన్వాడీ వర్కర్లకురూ. 10,500, ఆయాలకు రూ.6వేలు ఉండేది. ఈ ఐదేళ్లలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెంచారు. తెలంగాణలో గత ప్రభుత్వం ఇచిచన పీఆర్‌సీతో అక్కడి సిబ్బందికి వేతనాలు బాగా పెరిగాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో వర్కర్‌కు రూ.13600, ఆయాలకు రూ.10వేలు ఇస్తున్నారు. జగన్ ఇచ్చిన హామీ ప్రకారమైతే ఇక్కడ అంగన్వాడీ కార్యకర్తలకు రూ.14,600, ఆయాలకు రూ.11 వేల జీతం ఇవ్వాలి. కానీ ఇప్పుడు జగన్ ప్రభుత్వం ఇచ్చేది అంగన్వాడీ వర్కర్‌కు రూ.11500, ఆయాకు రూ.7వేలు మాత్రమే. ఇలా జీతం విషయంలో జగన్ మాట తప్పారు. ఇక, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పనిభారాన్ని తగ్గించాలని, విధుల్లో చనిపోతే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మట్టి ఖర్చులకు ఆర్థికసాయం చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు. వీటన్నింటిపై ఆందోళన చేస్తే తొలగింపుల పేరిట ప్రభుత్వం బెదిరించింది. వీరి ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసింది. చివరకు వీరి సమస్యలను అధ్యయనం చేయడానికి కమిటీ వేస్తామని చెప్పింది. నాలుగు నెలలవుతున్నా ఇంత వరకు అతీగతీ లేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చాయి. దగా పడిన అన్ని వర్గాల్లాగే వీరూ ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి 'సిద్ధం'గా ఉన్నారు.



ప్రభుత్వం దగా చేసింది



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నిరవధిక సమ్మె చేసినా ప్రయోజనం లేక పోయింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న మమ్మల్ని వైసీపీ ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణం. 12 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెడితే ఎనిమిదింటినే ఒప్పుకొన్నారు. వయోపరిమితికి సంబంధించి మాత్రమే జీవో తప్ప మిగతావన్నీ నీటి మాటలుగానే మిగిలిపోయాయి.

- సుజని, జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్

కోడ్ పేరుతో కిట్ ఇవ్వలేదు



ఎన్నికల కోడ్ పేరుతో మూడు నెలలుగా గర్భవతులు, బాలింతలకు కిట్‌ను ఇవ్వడం లేదు. గతంలో చాలా మంది కిట్ ద్వారా రాగి పిండి, అటుకలు, బెల్లం, ఖర్జూరం, చిక్కీలను తీసుకునే వారు. కోడ్ నెపంతో ప్రభుత్వం వీటిని పంపిణీ చేయడం లేదు. గర్భవతులు, బాలింతలకు అందే పౌష్టికాహారం అందడం లేదు.

- షకీలా, జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీ యూనియన్

మెయిన్ సెంటర్లుగా మార్చాలి



మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. చాలా మంది అర్హత ఉండి కూడా ఏళ్ల తరబడి ప్రమోషన్ పొందలేకపోతున్నారు. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. సమ్మె చేసిన సమయంలో అధికారుల ఒత్తిడి, పనిలేకపోతే జీవనం పోతుందనే భయంతో జిల్లాలో కొంత మంది వరకు చనిపోయారు. వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

- జ్యోతి, డివిజన్ అధ్యక్షురాలు, పలమనేరు

● కుప్పం చరిత్ర

ద్రావిడ సంగమం

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులు కలిగివున్న నియోజకవర్గం కుప్పం. ద్రావిడ సంస్కృతీ సంప్రదాయాల మేళవింపు ఇక్కడ కనిపిస్తుంది. విసిరేసినట్టు ఉండే ఈ నియోజకవర్గం చంద్రబాబు రాకతో మారిపోయింది. ఎన్టీయార్ ముందుచూపుకు నిదర్శనంగా ద్రావిడ విశ్వవిద్యాలయం వెలిసింది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును వరుసగా 7 సార్లు గెలిపించి, మూడుసార్లు ముఖ్యమంత్రి నియోజకవర్గం అనే ఘనత దక్కించుకుంది.



నియోజకవర్గం ఏర్పడిన సంవత్సరం: 1955

ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు: 13

ఎమ్మెల్యేలు

1955- డి.రామబ్రహ్మం- కాంగ్రెస్
1962- ఏపీ వజ్రవేలుశెట్టి- సీపీఐ
1967- డి.వెంకటేశం- స్వతంత్ర
1972- డి.వెంకటేశం- స్వతంత్ర
1978- బీఆర్ దొరస్వామినాయుడు- కాంగ్రెస్
1983, 1985- ఎన్.రంగస్వామినాయుడు- టీడీపీ
1989, 1994, 1999, 2004, 2009, 2014, 2019 - నారా చంద్రబాబునాయుడు- టీడీపీ

ప్రస్తుతం

మండలాలు: కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం
ఓటర్ల సంఖ్య: 2,23,104
పురుషులు: 1,11,231
స్త్రీలు: 1,11,855
ఇతరులు: 18
పోలింగ్ బూత్‌ల సంఖ్య: 175



- కుప్పం

నగరిలో మట్టి మాఫియా

గుట్టల్ని మింగేస్తున్న అవినీతి 'అనకొండలు' వారు. అధికారం అండగా చెలరేగిపోతూ.. కొండల్ని పిండి చేస్తున్నారు. మట్టి నుంచి డబ్బు పిండుతున్నారు. ఇలా ఐదేళ్లుగా నగరిలో మట్టిమాఫియా చెలరేగిపోతోంది. ప్రకృతి సంపదను కొల్లగొడుతోంది.

- నగరి

● ఇష్టారాజ్యంగా గుట్టలు తవ్వేస్తున్నారు ● తమిళనాడుకు మట్టి తరలిస్తున్నారు


నగరి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలకు అంతూపొంతూ లేకుండా పోయింది. మట్టిపైనా వీరి కన్ను పడింది. పొరుగున తమిళనాడులో మట్టికి డిమాండు ఉండడంతో అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో మాఫియా రెచ్చిపోతోంది. నగరి, విజయపురం మండలాల్లో అనుమతులు లేకుండానే కొండలు తవ్వి తరలించేస్తున్నారు. విజయపురం మండలంలో మంత్రి రోజా సోదరుల సహకారంతో తాత్కాలిక అనుమతులు చూపిస్తూ ఏళ్ల తరబడి మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తడుకు రెవెన్యూలో సర్వే నంబరు 89-1, 89-2లలో అనుమతి లేకుండానే తవ్వేస్తున్నారు. సత్రవాడ 245 సర్వే నంబరులో లీజుకు తీసుకున్నా పరిమితికి మించి తరలిస్తున్నారు. కడపకు చెందిన సుదర్శనరెడ్డి పేరుతో ఈ క్వారీ నడుస్తోంది. క్వారీ నడిపేవారు మంత్రి కోటా కింద రోజూ 50 శాతం కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుందన్న ఆరోపణలున్నాయి.

మరో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో సత్యవేడుకు చెందిన వైసీపీ నాయకులు పాతార్కాడు, మహరాజపురం, శ్రీహరిపురం రెవెన్యూ పరిధిలో తాత్కాలిక అనుమతులతో మట్టి తరలిస్తున్నారు. ఈ తతంగమంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో మిన్నకుండిపోతున్నారు.

- నగరి

● అనకొండలు





విజయపురం మండలం శ్రీహరిపురంలో భారీ వాహనాలతో మట్టి తరలింపు (ఫైల్‌ఫొటో)

- సత్రవాడలో కొండను తవ్వేస్తున్నారిలా..

కంచుకోటలో పట్టు బిగించిన టీడీపీ

పలమనేరు వర్తమానం

● ఐదేళ్లుగా ప్రజల మధ్యనే అమరనాథరెడ్డి
● వైసీపీ నుంచి పెరిగిన చేరికలు
● పలమనేరులో అధికార పార్టీ ఆగడాలపై వ్యతిరేకత

పలమనేరు, ఏప్రిల్ 19: గత ఎన్నికల్లో కోల్పోయిన తమ కంచుకోట పలమనేరు నియోజకవర్గంలో ఈసారి పాగా వేసేందుకు టీడీపీ కృతనిశ్చయంతో అడుగులు వేస్తోంది. 2019 ఓటమి నుంచి ఇప్పటి వరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి నియోజకవర్గ ప్రజల మధ్య నే ఉంటున్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూనే వైసీపీ ప్రజావ్యతిరేక కార్యక్రమాలను గట్టిగా ఎండగడుతున్నారు. ఇసుక, క్వారీలలో అక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో సఫలీకృతమయ్యారు. మండలాల్లో గ్రాఫ్‌ను బాగా పెంచుకొన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేసిన ప్రజాప్రతినిధులను టీడీపీ వైపు మళ్లించగలిగారు. వైసీపీకి పెద్దదిక్కుగా ఉండే మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి సోదరుడు విజయభాస్కర రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ మధ్య ఏర్పడిన అంతరం అమరనాథరెడ్డికి అనుకూలంగా మారిందని సమాచారం. ఈ విషయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు రెడ్డెప్ప, మిధున్‌రెడ్డిలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విజయభాస్కరరెడ్డి టీడీపీకి పనిచేయకపోయినా ఆయన వైసీపీపై సానుకూలంగా లేకపోవడం అమరనాథరెడ్డికి కలిసొచ్చే అంశమే. పలమనేరు మండలంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మున్సిపాలిటీ కౌన్సిలర్ కూడా టీడీపీ కండువా కప్పుకున్నారు.



అమరనాథరెడ్డి

అక్రమాలపై ప్రజా వ్యతిరేకత

కౌండిన్య నది నుంచి పలమనేరు వైసీపీ నాయకులు అధికార దర్పంతో ఇసుక తరలించడాన్ని ప్రజలు నిరసిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో పేదలను అధికార పార్టీనేతలు వేధించడం, గంటావూరు ఇందిరమ్మ కాలనీలో స్థలాల్లో అక్రమాలకు పాల్పడటం స్థానికంగా వైసీపీపై వ్యతిరేకత పెంచింది. గంగవరం మండల వైసీపీ నాయకులపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. పలమనేరులోని ఖాళీస్థలాల్లో వైసీపీవారు కబ్జాలకు పాల్పడటం టీడీపీకి అనుకూలిస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 1800 ఓట్లు వచ్చాయి. వైఎస్ షర్మిల ప్రచార ప్రభావంతో ఈసారి తమకు ఓట్లు పెరుగుతాయని కాంగ్రెస్ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఈ ఓట్ల ప్రభావం తమను దెబ్బ తీస్తుందని వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీకి ఓటు బ్యాంకుగా పరిగణించే ముస్లిం ఓటర్లను అమరనాథరెడ్డి ఆకర్షించడంలో ముందున్నారు. జనసేన యువకులు అమరనాథరెడ్డి ప్రచార కార్యక్రమాల్లో బలంగా నిలుస్తున్నారు. వైసీపీ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని వెంకటేగౌడ నమ్ముతున్నారు.



వెంకటేగౌడ

నేను సైతం



బంగారుపాళ్యం మండలం టేకుమందలో కరపత్రాలు పంచుతున్న విక్రమ్ చౌదరి

● టీడీపీ ప్రచార సమరంలో యువ ఎన్ఆర్ఐ

మాతృగడ్డపై మమకారానికి తోడు తాను అమితంగా ఇష్టపడే విజనరీ నేతల స్ఫూర్తిగా 'నేను సైతం' అంటూ ప్రచార సమరంలో పాలు పంచుకుంటున్నారో యువ పారిశ్రామికవేత్త. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెకు చెందిన ఎన్‌పీ విక్రమ్ చౌదరి అమెరికాలోని న్యూజెర్సీలో మార్కెటింగ్ బిజినెస్ చేస్తుంటారు. ఏడాదికి తన కంపెనీ ద్వారా రూ. 250 కోట్ల టర్నోవర్ చేస్తుంటారు. పుట్టిన గడ్డకు ఏదో రూపంలో సేవ చేయాలనే తలంపుతో నాలుగేళ్లుగా టీడీపీ పటిష్టతకు కృషిచేస్తూనే ఇక్కడ యువతకు చెన్నై, బెంగళూరు, హైదరాబాదులతో పాటు అమెరికాలో కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం బెంగళూరులో టీమును ఏర్పాటు చేశారు. గత ఆరునెలల్లో 300 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు విక్రమ్ చౌదరి చెప్పారు. భవిష్యత్ విజన్ ఉన్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, లోకేష్ తనకు ఆదర్శమంటారీయన. విదేశాల్లో నెల రోజులుండి, మరో నెల రోజులు పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రధానంగా యువతను చైతన్యపరుస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గ్రామాల్లో బలంగా ప్రచారం చేస్తున్నారు.

- చిత్తూరు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



పూతలపట్టు, ఏప్రిల్ 19: తాగడానికి నీళ్ళు లేక 25 రోజులుగా అవస్థలు పడుతుంటే చోద్యం చూస్తున్నారా అని పలువురు మహిళలు సచివాలయం ముందు బైఠాయించి ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. పూతలపట్టు మండలం ముత్తిరేవుల పంచాయతీ నగరపాలక సంస్థ 1వ వార్డు పరిధిలోకి వస్తుంది. ఇక్కడ గత 24 రోజులుగా తాగునీటి బోరు మరమ్మతులకు గురవ్వడంతో స్థానికులు వ్యవసాయ బావుల వద్దకెళ్ళి తెచ్చుకుంటున్నారు. బోరు మోటరును రిపేరుచేసి తాగునీటి సమస్య పరిష్కరించండంటూ స్థానికులు సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నా వారి నుంచి స్పందన కరువైంది. దీంతో స్థానిక మహిళలు శుక్రవారం సచివాలయ సిబ్బందిని లోపలికి వెళ్ళనివ్వకుండా గేటు వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించేంత వరకు తాము ఇక్కడినుంచి కదలమని, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సచివాలయం వద్ద బైఠాయించారు.

తాగునీరు వృథా కాకుండా చూడండి

పాలసముద్రం, ఏప్రిల్ 19: మండలంలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి ట్యాంకులు, బోర్లనుంచి సరఫరా అయ్యే నీటిని వృథా కాకుండా చూడాలని ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటిని ఇంటి అవసరాలకే ఉపయోగించుకోవాలని, పెరటితోటలు పెంచడానికి తాగునీటిని ఉపయోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవోఆర్డీ రమేష్ పాల్గొన్నారు. అనంతరం ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ ఉపాధి పథకం కింద చెరువు కాలువలు, కొండలనుంచి వచ్చే సప్లై ఛానల్స్ పనులకు ప్రాముఖ్యం ఇవ్వాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మార్గరెట్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కంపోస్ట్ యార్డుపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 19: మున్సిపల్ కంపోస్ట్ యార్డు నుంచి వస్తున్న విషవాయువు కారణంగా యార్డు చుట్టుపక్కల ఉన్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. శుక్రవారం లెనిన్‌నగర్‌లో సీపీఐ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగానే కంపోస్టు యార్డు అగ్ని ప్రమాదానికి గురైందన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కూడా విషవాయువులు, పొగ వెలువడకుండా నివారించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపీనాథ్, మణి, చంద్ర, విజయ్‌కుమార్, రఘు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నా కుమార్తె ఆచూకీ తెలపండి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 19: తన కుమార్తె ఆచూకీ తెలపాలని జీడీనెల్లూరు మండలం జూపల్లెకు చెందిన ధర్మారెడ్డి కోరారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తన కుమార్తె చిత్తూరులో ఇంటర్ చదువుతోందన్నారు. ప్రస్తుతం సెలవులు కావడంతో ఇంటివద్దే ఉందన్నారు. కాగా ఈనెల 14నుంచి ఆమె కనిపించలేదన్నారు. తన భార్య తమ్ముడు దివాకర్ మాయమాటలు చెప్పి అపహరించినట్లు అనుమానంగా ఉందని ఆరోపించారు.

నవమి వేడుకల్లో అన్నదానం



అన్నం వడ్డిస్తున్న గురజాల జగన్మోహన్

గుడిపాల, ఏప్రిల్ 19: మండలంలోని 197 రామాపురంలో శుక్రవారం సీతారామ కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చేతులమీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కోలావూరులో హరికథా చూడామణి జయంతిసావిత్రి సంపూర్ణ రామాయణం హరికథాగానాన్ని భక్తులకు వివరించారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 19: స్థానిక బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న 18వ వర్ధంతి సందర్భంగా చిత్తూరు టీడీపీ ఈడిగ బీసీ సాధికార సమితి అధ్యక్షుడు బుస్సా నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరక్టర్లు మహేంద్ర గౌడ్, నీరజాక్షులు గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, నాయకులు రెడ్డెప్ప, ధరణీనాయుడు, కమల్‌నాథ్ రెడ్డి, ఎన్‌పీ విక్రమ్, మాధవరావు గౌడ్, రాజమాణిక్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రాపురంలో అన్నదానం

గుడిపాల, ఏప్రిల్ 19: రామభద్రాపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన కుమారుడు రాజేష్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న గుడిపాల మండల మీట్

గుడిపాల, ఏప్రిల్ 19: గుడిపాల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేది ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

21న నేసనూరు గట్టులో వైద్యశిబిరం

పుత్తూరు, ఏప్రిల్ 19: పుత్తూరు మండలంలోని నేసనూరు గట్టు గ్రామంలో ఈనెల 21వ తేదీ పుత్తూరు వాకర్స్ అసోసియేషన్‌చే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు కెఎల్ఎన్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి, పుత్తూరు పట్టణాల నుంచి ప్రముఖ వైద్యనిపుణులు వస్తారని, వైద్య శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతుందని వివరించారు. ఉచిత మందులతోపాటు రోగులకు భోజన ప్యాకెట్లను అందిస్తామన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 19: నగరంలోని రాములవారి తేరు ఊరేగింపు సందర్భంగా ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ వీధి, చర్చి వీధి, బజారు వీధి, హైరోడ్, చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

చిన్నఆలపాకంలో వసంతోత్సవం

విజయపురం, ఏప్రిల్ 19: మండలంలోని చిన్నఆలపాకంలో సీతారాముల ఆలయంలో శుక్రవారం ఉదయం వసంతోత్సవం, డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిత్యం పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్య నిర్వాహకులు సుగుణామురళీకిషోర్, భక్తులు పాల్గొన్నారు.

కేసీపల్లిలో టీడీపీ ప్రచారం

పెనుమూరు, ఏప్రిల్ 19: కేసీపల్లి పంచాయతీ గ్రామాల్లో శుక్రవారం మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హరిబాబునాయుడు, ఈశ్వర్ నాయుడు, కిషోర్ నాయుడు, మనోహర్‌రెడ్డి, కృష్ణమూర్తినాయుడు భాస్కర్‌నాయుడు, వేణునాయుడు, విక్రమ్, సతీష్‌రెడ్డి, ధనరాజు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులకు శిక్షణ

వడమాలపేట,ఏప్రిల్19:వేసవి సెలవుల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ ఇవ్వడానికి ఒక గైడ్, రెండు స్కౌట్స్ యూనిట్లను 32మంది చొప్పున 96మంది విద్యార్థులను శుక్రవారం ఎంపికచేశారు. గైడ్ కెప్టెన్‌గా జయప్రద, స్కౌట్స్ మాస్టర్లు పీడీ చంద్రశేఖర్‌రాజు, వేలాయుధంలను నియమిస్తున్నట్లు వడమాల పేట హైస్కూల్ హెచ్‌ఎం కరుణ నవనీతం తెలిపారు. జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై అవగాహన కల్పించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా వయోజన వనరుల కమిషనర్ ఎం.ఎం.రెడ్డి ప్రాథమిక శిక్షణ ఇస్తారని తెలిపారు.

బీజేపీ తొత్తులుగా కొన్ని పార్టీలు : వీసీకే

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 19: రాష్ట్రంలో బీజేపీ తొత్తులుగా కొన్ని రాజకీయ పార్టీలు పనిచేస్తున్నాయని వీసీకే పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గణపతి ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాల్లో వీసీకే పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ నేతలు బాలకృష్ణ, విజయకుమార్, దేవ, గోవిందప్ప, సంతోష్, ఏసు, మాధవి పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో ఇద్దరు నామినేషన్ దాఖలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 19: గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గానికి రెండవరోజు శుక్రవారం ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరు రెండుసెట్లు, మరొకరు ఒకసెట్ నామినేషన్ దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ తెలిపారు. వారిలో పుత్తూరు టౌన్ ఎస్‌బీఐ కాలనీకి చెందిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కళత్తూరు కృపాలక్ష్మి రెండుసెట్లు నామినేషన్లు, వెదురుకుప్పం మండలం నెమలగుంటకు చెందిన పళ్ళిపట్టు గుణశేఖర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఒకసెట్ నామినేషన్ ఫారాలు అందజేశారని చెప్పారు.

హెచ్‌డీఎస్‌లో అవకతవకలపై విచారణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 19: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 2012లో హెచ్‌డీఎస్ నిధుల ద్వారా మందులు కొనుగోలులో జరిగిన అవకతవకలపై కడప రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రత్నకుమారి శుక్రవారం విచారణ చేశారు. 2012లో చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్‌డీఎస్ నిధులు వ్యవహారం చూసిన అధికారులను ఆమె విచారణ చేశారు. నివేదికలను ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

చిత్తూరు, ఏప్రిల్ 19: నగరపాలక సంస్థ పరిధిలో నిర్దేశించుకున్న రూట్ మ్యాప్‌ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఏఆర్వో అరుణ శుక్రవారం పరిశీలించారు. పీవీకేఎన్ కళాశాల నుంచి రూట్ నెంబరు 2, 4 పరిధిలోని 22 పోలింగ్ కేంద్రాలను సంబంధిత సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అదేవిధంగా సంతపేటలోని పది పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీపీ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు

గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న గురజాల ప్రతిమ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 19: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. శుక్రవారం నగరంలోని 19వ డివిజన్ పెన్షనర్స్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, గాయత్రి నగర్, కాజూరు, 25వ వార్డు పరిధిలోని బాలాజి నగర్, మరాఠీ వీధి, గాంధీ నగర్‌లలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. మహా శక్తి పథకంలో భాగంగా 18 ఏళ్ళు నిండిన ప్రతి స్త్రీకి 'ఆడబిడ్డ నిధి' కింద నెలకు రూ.1500, 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి రూ.15,000 'దీపం' పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, 'ఉచిత బస్సు ప్రయాణం' పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ళ ప్రసాదరావులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వైవీ రాజేశ్వరి, కాజూరు రాజేష్, గౌతమ్, శంకర్, విజయలక్ష్మి, బీజేపీ నేతలు చిట్టిబాబు, రామ్మూర్తి, హేమంత్, పాండ్యన్, ఏకే హరి, జనసేన నేతలు యశ్వంత్, జయంతి, మురళి ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు గురజాల పరామర్శ



గుడిపాల : రెండ్రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీడీపీ, జనసేన కార్యకర్తలను శుక్రవారం చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పరామర్శించారు. 190 రామాపురం సీఎంసీలో టీడీపీకి చెందిన దాము, తమిళనాడు రాష్ట్రం రాణిపేటలోని నర్సి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, కార్యకర్తలను పరామర్శించారు. ఆయన వెంట పీటర్, బాలాజి నాయుడు, చెన్నకేశవులు నాయుడు ఉన్నారు.

అరాచక పాలనకు స్వస్తి పలకాలి : గాలి భాను



భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన మీరాసాహెబ్‌పాళెంవాసులు

వడమాలపేట, ఏప్రిల్ 19: భూదందా, ఇసుక మాఫియాతో ప్రజాధనం దోచేస్తున్న వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ కోరారు. శుక్రవారం మండలంలోని తిరుమణ్యంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా సంపాదించిన డబ్బుతో మభ్యపెట్టే వైసీపీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపడితే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడిగా అభివృద్ధి చేసి చూపిస్తానని, విశ్వసించి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ధనంజయులు నాయుడు, వెంకటయ్య, మణిరాజు, విశ్వనాథ్, జ్యోతి, శీను, హరి, రామకృష్ణ, శివరాజు, సునీల్, రఘురామ్, దేవ, దాముయాదవ్, సుబ్రమణ్యం యాదవ్, వెంకటేశ్వరావ్, బత్తినాయుడు, రవినాయుడు, రామూర్తి నాయుడు, శేషాద్రి యాదవ్, సుమకుర్, జనసేన నాయకులు మునిశేఖర్, చక్రవర్తి, బాలాజీ, వెంకటేష్, శేషాద్రి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నగరి : మంత్రి రోజా దత్తత గ్రామమైన నగరి మండల పరిధిలోని మీరాసాహెబ్‌పాళెంకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మండల టీడీపీ కార్యదర్శి పురుషోత్తంనాయుడు,, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచి జలీల్‌భాయ్, నబీ, మరో 25 మంది టీడీపీలో చేరారు.

టీడీపీతోనే నేత కార్మికులకు చేయూత

నగరి ఏప్రిల్ 19: టీడీపీతోనే నేత కార్మికులకు చేయూత లభిస్తుందని, ఆ పార్టీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని సెంగుంది మొదలియార్లు ప్రకటించారు. నగరిలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన సెంగుంది మొదలియార్ల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదలియార్లు భానుప్రకాష్‌కు తమ గోడు వినిపించారు. 2019లో నాడు ప్రతిపక్షంలో వున్న జగన్ ఎన్నికల ప్రచారంలో నేతన్నలకు తమిళనాడు తరహాలో 500 యూనిట్లు ఉచిత విద్యుత్, 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తామని చెప్పి, గెలిచాక మాటతప్పారని వారు పేర్కొన్నారు. స్థానికంగా టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదన్నారు. నేతన్నలు తమిళనాడులో లిఫ్ట్ ఆపరేటర్లుగా, సెక్యూరిటీ గార్డులుగా, హోటళ్లలో క్లీనింగ్ పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నలకు ఈ పరిస్థితి రావడానికి వైసీపీ ప్రభుత్వమే కారణమని వాపోయారు. భానుప్రకాష్ మాట్లాడుతూ గతంలో నగరి నేతన్నలు నేసిన వస్త్రాలకు దేశ విదేశాలలో మంచి గిరాకీ వుండేదని ఆయన గుర్తు చేశారు. మరమగ్గ కార్మికులకు తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్వ వైభవాన్ని తీసుకురావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదలియార్ల సంఘం అధ్యక్షుడు వీకేఎస్ వాసు, పొన్నుస్వామి, గణేష్ మొదలియార్, పుత్తూరు మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణాకరన్, పొన్నప్పన్, శ్రీనివాసన్, బీపీ ఆర్ముగం, దయాలన్, పళని, రజనీకాంత్ కర్ణ, మదివానన్, మాణిక్యవాసన్, పలువురు మొదలియార్లు పాల్గొన్నారు.



మొదలియార్ల సమావేశంలో ప్రసంగిస్తున్న భానుప్రకాష్

వినోద భరితంగా వయ్యాళి సేవ

● యాళి వాహనంపై స్వామివారు



స్వామివారికి వయ్యాళిసేవ



యాళి వాహనసేవ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 19: నగరంలోని కోదండ రామాలయంలో ఆరు రోజులుగా శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం వి. కందబాబు, కె.రామానుజలశెట్టి, ప్రగతి బుక్ స్టోర్స్ ఉభయంతో స్వామివారు పల్లకిలో మోహిని అలంకారంతో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా మధ్యాహ్నం ఆలయం ఎదుట తంజావూరు, తిరువళ్ళూరు కళాకారులచే వినోదభరితంగా వయ్యాళి సేవ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి సాయి సంజన టెక్స్‌టైల్స్ ఉభయంతో యాళివాహన సేవనిర్వహించారు.ఇదిలాఉండగా శనివారం ఉదయం స్వామివారికి వేణుగోపాలంకారం, వసంతోత్సవం, గజవాహనసేవలు నిర్వహించనున్నారు.

ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తా

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



నామినేషన్ వేయడానికి సైకిల్‌పై వెళుతున్న మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 19: ఓటువేసి నన్ను ఆశీర్వదించండి. మీకు సేవకుడిగా ఉంటూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన టీడీపీ శ్రేణులతో పూతలపట్టుకు చేరుకుని, మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో రిటర్నింగ్ అధికారి చిన్నయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనను గెలిపిస్తే పార్టీ అధినేత చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుతానని హామీ ఇచ్చారు.

టీడీపీలో చేరిన పాలఏకరిలు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 19: తుంబకుప్పం గ్రామానికి చెందిన పాలఏకరి కులస్తులు హరీష్, మనోహర్, సుకుమార్, సుబ్రహ్మణ్యం, వాసు, నిరంజన్, మధు, ప్రసన్న తదితరులు తెలుగు యువత రమేష్, ప్రసాద్, మాజీ అధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎన్‌పీ ధరణీనాయుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

నగరిలో రెండు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న మంత్రి రోజా

నగరి ఏప్రిల్19: నగరిలో శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ తరపున మంత్రి రోజా, ఇండిపెండెంట్‌గా ధనశేఖర్‌శెట్టిలు నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి ఆర్‌కే రోజా నగరిలో అగర వినాయకస్వామి ఆలయంలో ఉదయం పూజలు ముగించుకుని ర్యాలీతో నగరి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. భర్త సెల్వమణి, భైరెడ్డి సిద్దారెడ్డిలతో కలిసి వెళ్లి ఉదయం 12.25 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు.

ఎస్వీసెట్‌లో హీరోయిన్ల సందడి



పూతలపట్టు : మండలంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సెలస్టా 2కే24 లో భాగంగా శుక్రవారం సినీ హీరోయిన్లు సంయుక్తమీనన్, అనన్య రావడంతో సందడి నెలకొంది. పాటలు, డ్యాన్స్‌లతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. కళాశాల చైర్మన్ రావూరివెంకటస్వామి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథరెడ్డి, సెలస్టా కన్వీనర్లు రాజ్‌కుమార్, రాజారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవం



పెనుమూరు, ఏప్రిల్ 19: మండలంలోని సీఎస్ అగ్రహారం రాములగుడిలో శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదారులుగా మంజుల జ్యోతిరెడ్డి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం దొడ్డ డెయిరీ, చార్వాగానిపల్లె, సీఎస్ అగ్రహారంలలో ఊరేగించారు.

చంద్రబాబు మెజారిటీ కోసం పూజలు



నగరి ఏప్రిల్19: కుప్పంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు లక్ష ఓట్ల మెజారిటీతో గెలవాలని నగరిలోని సామాలమ్మ గుడిలో నాయకులు చలపతి, లత తదితరులు పూజలు చేశారు. వినూత్నరీతిలో మైసూర్ పాక్‌తో ఒకలక్ష అని రాసి చంద్రబాబు చిత్రపటాన్ని అమ్మవారి వద్ద వుంచి మధ్యాహ్నం సరిగ్గా ఒక గంటా ఇరవైఏడు నిమిషాలకు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నామినేషన్ దాఖలు చేసే సమయానికి నగరిలోని సామాలమ్మ గుడిలో పూజలు నిర్వహించారు. భారతి, అలిమేలు, రాధ, అంజేరమ్మ, హేమ, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 19: బంగారుపాళ్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ పూతలపట్టు అభ్యర్థి ఎం.ఎస్.బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా 70 మంది వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. అలాగే తవణంపల్లె మండలానికి చెందిన మాజీ సర్పంచ్ ఆర్ముగం పార్టీలో చేరారు. బంగారుపాళ్యానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దాము కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ రవిప్రసాద్, ఐరాల యూత్ అధ్యక్షుడు భార్గవ్ రెడ్డి, శివ, బుల్లెట్ రామ్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై దాడి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 19: పాతకక్షల కారణంగా యువకుడిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటన పుత్తూరులో జరిగింది. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు.. పట్టణ పరిధిలోని నందిమంగళం దళితవాడకు చెందిన దివ్యాంగుడైన శివ(40)పై శుక్రవారం సాయంత్రం మరాఠీగేట్ వద్ద పట్టణంలోనే ఫ్లెక్సీ దుకాణం నడుపుతున్న శంకర్‌రాజు తన ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. కిందపడిన శివపై శంకర్‌రాజు దాడి చేశాడు. గాయపడిన అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు బాధితుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.